క్లుప్తంగా

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



సింహాద్రిపురంలో పాడిరైతులకు పశుపోషకాలు అందిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది

కిర్లంపూడి: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి వినోద్ సూచించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సింహాద్రిపురంలోని ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సుమారు 150 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా గాళ్లవ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధి సోకితే పశువుల ప్రాణానికే ప్రమాదమన్నారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రె నాగేశ్వరరావు, వి.సుధీర్, పి.శ్రీను, మురళి, ఎ. నాగేశ్వరరావు, బి.రోషిణి తదితరులు పాల్గొన్నారు.

రేపు కాకినాడలో జాబ్‌మేళా

కోటనందూరు: కాకినాడకు చెందిన బెస్ట్ కెరీర్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధినేత కేవీ రమణ సోమవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో యాక్సిస్ బ్యాంకు, హెటిరో డ్రగ్స్, అపోలో హాస్పిటల్, ఉదయ్ ఓవర్‌సిస్ ఎడ్యుకేషన్, పంజాబ్ నేషనల్ బ్యాంకు, మెట్ లైఫ్, అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన యువతీ, యువకులు విద్యార్హత ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. కాకినాడ గాంధీనగర్‌లో బెస్ట్ కెరీర్ సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధులకు అన్నదానం

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేట శివారు శారదా వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దనాపల్లికి చెందిన బుజ్జి యువసేన ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం వృద్ధుల సమక్షంలో బుజ్జి బర్త్ డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి శేఖర్, గొల్లపల్లి కృష్ణ, అప్పికొండ తాతాజీ, మట్ల చిన్ని, తోట చక్రధర్, వివేకానందా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

ప్రత్తిపాడు రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ సూచించారు. మండలంలోని ప్రత్తిపాడులో సోమవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ద్వారా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగిలిదేవి సత్తిరాజు, మండల అధ్యక్షుడు కందా వీరస్వామి, ఉపాధ్యక్షుడు వూట వీరబాబు, శెట్టి గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



దానవాయిపేటలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నారు. గ్రామ ప్రధాన రహదారిలోని నర్సిపేట సరిహద్దు ప్రాంతంలో ఓ బిల్డింగ్‌ను ఆనుకుని విద్యుత్ వైర్లు ఉండటంతో తరచూ షార్ట్ సర్క్యూట్ అవుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ వైర్లను సరి చేయాలని గ్రామ జేఎల్ఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. రెండు వారాల క్రితం విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌లైన్లను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి

నిరుపేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో వైద్య వృత్తిలోకి వస్తున్నాం. కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై మానవ మృగాలు హత్యాచారం చేయడం బాధాకరం. ఇటీవల కాలంలో ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందిపై దాడులు పెరిగిపోతున్నాయి. ఇలాంటి దాడులకు పాల్పడుతున్న ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి. వైద్యుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ ఎం.కన్యాకుమారి, గైనకాలజిస్టు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు





మహిళలకు రక్షణ కల్పించాలి

విధులు నిర్వహించే, పని చేసే స్థలాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన మమ్మల్ని కలచివేసింది. మహిళలకు పని చేసే చోటే భద్రత లేకపోతే చాలా కష్టం. కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి. మహిళలను గౌరవించే సాంప్రదాయాన్ని చిన్ననాటి నుంచి పిల్లలకు అలవాటు చేయాలి.

డాక్టర్ సుగంధి, సీహెచ్‌సీ డాక్టర్, జగ్గంపేట

ముకుంద.. మురారి

- వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు
- గ్రామాల్లో ఉత్సాహంగా ఉట్టుకొట్టు ఉత్సవాలు



కిర్లంపూడిలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించిన విద్యార్థులు



తేటగుంటలో విశేష అలంకరణలో శ్రీకృష్ణుడు



తునిలో గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు

ఏలేశ్వరం: శ్రీకృష్ణుని జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో కృష్ణాష్టమి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. గ్రామాల్లోని కృష్ణాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. ఏలేశ్వరం వాగువారివీధిలో ఆలయధర్మకర్త వాగు సూరిబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తుని రూరల్: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తేటగుంట, రాపాక, వి.కొత్తూరు, హంసవరం, డి.పోలవరం, ఎస్.అన్నవరం, కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. హంసవరంలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి విద్యార్థులకు కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. తేటగుంట, డి.పోలవరం, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిర్లంపూడి: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. రాజుపాలెం శ్రీకృష్ణాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జగపతినగరం, కొండయ్యపేట, నర్సయ్యపేట, కిర్లంపూడితో పలు రామాలయాల్లో ఏకాహం నిర్వహించారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టేందుకు యువత పోటీ పడ్డారు.

శంఖవరం: మండలంలోని కృష్ణాలయాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారి ఆలయాలకు పోటెత్తారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.కత్తిపూడి, శంఖవరం, నెల్లిపూడి, మండపం, జి.కొత్తపల్లి, అచ్చంపేట తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యువకులు ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు.

తొండంగి: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎ.కొత్తపల్లి, తొండంగి, శృంగవృక్షం, వేమవరం, పెరుమాళ్లపురం, ఏవీ నగరం, బెండపూడి గ్రామాల్లోని కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాలు, ప్రధాన వీధుల్లో ఉట్టి ఉత్సవం నిర్వహించారు. రాధాకృష్ణులను పల్లకీలపై ఊరేగించారు. చిన్నారులు కృష్ణుని వేషధారణలతో అలరించారు.

తుని: పట్టణ ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు వేకువజామున లేచి పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు పోటెత్తారు. తాండవ నదీతీరంలోని శ్రీకృష్ణుడు ఆయాలనికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉట్టికొట్టె కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కొత్తపేట నారాయణ స్కూల్ సమీపంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకులను కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి జనన విశిష్టతను త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖరుబాబు వివరించారు. వాకర్స్ గవర్నర్ కుచ్చర్లపాటి భీమరాజు, సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, నారాయణ విద్యాసంస్థల మేనేజర్ స్రవంతి, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఎల్.రోహిణి, సూర్య, బీటీ నాయుడు, సత్య నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో..

స్థానిక బ్యాంకుకాలనీ సరస్వతీ శిశు మందిర్‌లో కృష్ణాష్టమి వేడుకులను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వేషధారణలు, కోలాటం, భజనలతో ఆకట్టుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఇసరపు స్వామి, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక గొట్టుముక్కల వారి వీధిలో మహేష్, రాధిక దంపతుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకులు నిర్వహించారు.

గండేపల్లి: మండలంలో శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణాలయాల్లో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గండేపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేట, తాళ్లూరు, మల్లేపల్లి, మురారి తదితర గ్రామాల్లో ఉట్టుకొట్టు సంబరాలు జరిగాయి. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చాన్సలర్ ఎస్.శేషారెడ్డి, ప్రో చాన్స్‌లర్ సతీష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని పెద్దిపాలెంలో ఉట్టికొట్టే సంబరం నిర్వహించారు. ధర్మవరంలో యాదవ్ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి చిత్రపటాలతో యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణాలయాల్లో సందడి నెలకొంది. ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

గోకవరం: స్థానిక ఫారెస్ట్ ఆఫీస్ వద్ద గల కృష్ణాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు.



రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో ఉట్టు కొట్టు సంబరం

గీతోపదేశం ఘట్టం విగ్రహావిష్కరణ

కిర్లంపూడి: చిల్లంగిలోని పిరమళ్ల స్తంభం వద్ద ఉన్న శ్రీపట్టాభిసీతారామ మందిరంపై అర్జునుడికి శ్రీకృష్ణుడు గీతోపదేశం చేస్తున్న ఘట్టాన్ని తెలుపుతున్న విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. సుమారు రూ.3.5 లక్షలతో ఐదు గుర్రాలతో కూడిన రథం, శ్రీకృష్ణుడు, అర్జునుడు విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీకృష్ణార్జున యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు గీతోపదేశం చేస్తున్న ఆ అద్భుత ఘట్టాన్ని భక్తులు అసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆవిష్కరణతో గ్రామానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గొడే మాణిక్యాలరావు, దిడ్డి సుబ్బారావు, సంఘన వెంకటేశ్వరరావు, గోడే చంద్రశేఖర్, కొల్ల అంబు తదితరులు పాల్గొన్నారు.



చిల్లంగిలో అర్జునుడికి శ్రీకృష్ణుడు గీతోపదేశం ఘట్టం విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం



ఏలేశ్వరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండయ్యపేట రామాలయంలో ఏకాహం నిర్వహిస్తున్న మహిళా భక్తులు



తుని కొత్తపేటలో శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న భక్తులు



తపోవనం ఆశ్రమంలో విద్యార్థులకు కృష్ణాష్టమి విశిష్టతను వివరిస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

స్ఫూర్తి ప్రదాత మదర్ థెరిసా



తుని ఏరియా ఆసుపత్రిలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఏలేశ్వరంలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

- ఘనంగా సేవామూర్తి జయంతి వేడుకలు
- గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

తుని: సేవకు ప్రతిరూపమైన మదర్ థెరిసాను యువత ఆదర్శంగా తీసుకోవాలని సాయిరాం ఆటో యూనియన్ అధ్యక్షుడు దండెం సురేష్ సూచించారు. తుని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. యూనియన్ కార్యదర్శి బీర అప్పారావు, మాజీ కౌన్సిలర్ దంతులూరి శ్రీనివాసరాజు, జనసేన తుని నియోజకవర్గ ఇన్‌చార్జి చోడిశెట్టి గణేష్, జెడ్‌ఆర్‌యూసీ సభ్యుడు బోడపాటి శ్రీను, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి వైవీ మోహనరంగా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం మదర్‌థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్ థెరిసా స్ఫూర్తిని నేటి యువత అదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వూర రాజబాబు, తుండూరు రాము, అలమండ దుర్గావెంకటప్రసాద్, జ్యోతుల శ్రీనివాస్, కప్పల నాగభూషణం, మండల వైద్యాధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీ ఆవిర్భావ వేడుకలు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)ని స్థాపించి 60 ఏళ్లు పూర్తి కావడంతో పట్టణంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. వీహెచ్‌పీ వ్యవస్థాపకుడు చిన్మాయనందాస్వామిని స్మరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మండల కార్యదర్శి కటకం కిరిటీ మాట్లాడుతూ 1964లో కృష్ణాష్టమి నాడు వీహెచ్‌సీని స్థాపించారన్నారు. 60 వసంతాల వేడుకలు వారంరోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. పట్టణంలో మంగళవారం రాష్ట్ర మహసభ నిర్వహిస్తామన్నారు. అనంతరం పరిషత్ అనుబంధ సంస్థలైన మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాలతో భగవద్గీత, విష్ణుసహస్రనామ పారాయణలు చేశారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఏడీవీ ప్రసాద్, తూమురొతు గురయ్య, ఉడతల రమణారావు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో భగవద్గీత పారాయణ చేస్తున్న వీహెచ్‌సీ సభ్యులు

మొక్కలు నాటిన పర్యావరణ పరిరక్షణ సంఘం



గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న పర్యావరణ పరిరక్షణ సంఘం నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సంఘం నాయకులు సుమారు 50 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు, కార్యదర్శి గోళ్ల నాగేశ్వరరావు, చందువోలు సాయిరాజా, వేల్పుల సూరిబాబు, తిరగటి సత్యనారాయణ, తాళ్లూరి గొల్లాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేసే వరకూ పోరాటం

గోకవరం: ఎస్సీ వర్గీకరణ రద్దు చేసే వరకూ పోరాడతామని మాల మహానాడు గోకవరం మండల కమిటీ అధ్యక్షులు అంబటి అబ్రహం అన్నారు. గోకవరంలో సోమవారం మాల మహానాడు మండల కమిటీని ఏర్పాటు చేశారు. 30 మంది సభ్యులతో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకులు గుల్లా ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు ఐవీఆర్‌వీ ప్రసాద్ కుమార్, కార్యదర్శి కొయ్య సాల్మాన్‌రాజు, కోశాధికారి మెప్పెల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గండేపల్లి: మోటార్ సైకిల్ అదుపుతప్పిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన సానిబోయిన వీరబాబు అతని బంధువు నక్కా శ్రీను ఈ నెల 23న మోటార్ సైకిల్‌పై జగ్గంపేట నుంచి నీలాద్రిరావుపేట వస్తుండగా ఆదిత్య హాస్పిటల్ వద్దకు వచ్చే సరికి మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పత్తి.. వరద ముంచెత్తి..



టి.తిమ్మాపురంలో ముంపులో ఉన్న పత్తిపంట

తుని రూరల్: నియోజకవర్గంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలు ముంపునకు గురయ్యాయి. పలు గ్రామాల్లోని పత్తి పంటను వరద నీరు ముంచెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుతడిగా సాగయ్యే పత్తి చేలు ముంపునకు గురికావడంతో మొక్కలు గిడసబారి పంట దెబ్బతింటుందని టి.తిమ్మాపురం, ఎస్.చామవరం, హెచ్.కొత్తూరు, ఎ.అగ్రహారం, హంసవరం తదితర గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూత, పిందె దశలో ఉండగా భారీ వర్షాలు కురవడం పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ సంవత్సరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో రైతులు 1455 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఇలాగే వర్షాలు కురిస్తే పెట్టిన పెట్టుబడులు నష్టపోతామని రైతులు పేర్కొన్నారు. ముంపు నివారణకు పొలాల్లో కాలువలు ఏర్పాటు చేసుకోవాలని ఏడీఏ సుంకర బుల్లిబాబు రైతులకు సూచించారు.

మహిళలకు లఖ్‌పతి దీదీపై అవగాహన

గోకవరం: ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఏపీఎం సునీత ఆధ్వర్యంలో లఖ్‌పతి దీదీ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఖ్‌పతి దీదీ పథకానికి మండలంలో సుమారు 4000 మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురు సీసీలు, 53 మంది యానిమేటర్ల సహాయంతో 150 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వీరికి రూ.1.50 కోట్ల రుణాలు మంజూరు కాగా నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఇనుకోటి బాపన్న దొర, మహిళలు పాల్గొన్నారు.



గోకవరంలో మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

స్థలాల లీజుపై 28న సమావేశం

కాకినాడ సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీ కాకినాడ డిపో పరిధిలోని పెద్దాపురం, కాకినాడ, సామర్లకోట, పిఠాపురం బస్ స్టేషన్లలో ఖాళీ స్థలాలకు 15 ఏళ్ల కాల పరిమితికి టెండర్లు పిలిచినట్టు డిపో మేనేజర్ మనోహర్ సోమవారం తెలిపారు. బిడ్‌పై వివరణ కోసం ఈ నెల 28న రాజమహేంద్రవరంలో జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఉదయం 11.30కు జరిగే సమావేశానికి హాజరై, పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు కాకినాడ డిపో మేనేజర్ 99592 25534, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 73829 24916 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

గండేపల్లి: మండలంలోని పి.సూరంపాలెంలో సారా తయారీ కేంద్రాలపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 1600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై తెలిపారు.



పి సూరంపాలెంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న కానిస్టేబుల్